క్లుప్తంగా

భద్రతతో కూడిన ప్రయాణం క్షేమకరం



దాచేపల్లి: భద్రతతో కూడిర ప్రయాణం క్షేమకరమని ఎస్ఐ సౌందర్యరాజన్ అన్నారు. గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సాగర్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రహదారి భద్రతపై సోమవారం ఎస్ఐ అవగాహన కల్పించారు. దిచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారు నడిపే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సేఫ్టీ అధికారి సంజయ్‌కుమార్ సింగ్, అధికారులు వేణు, రామకృష్ణ, నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, గణేష్, నరసింహులు, వీర ప్రకాష్, లక్ష్మీరెడ్డి, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



పిడుగురాళ్ల: హెల్మెట్ ధరించి ప్రాణాలు సురక్షితంగా ఉంచుకోవాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలో హైవే వద్ద సోమవారం వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పిల్లలకు ద్విచక్ర వాహనం ఇచ్చే సమయంలో హెల్మెట్‌ను ఇచ్చి పంపించాలని సూచించారు. కొంత మంది వాహనదారులకు ఉచితంగా హెల్మెంట్లు అందించేందుకు జానపాడు గ్రామానికి చెందిన మప్పాళ్ల సాంబశివరావు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు శివనాగరాజు, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్చి ఆస్తుల రక్షణ ప్రతి ఒక్కరిది

గురజాల రూరల్: చర్చి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెంట్రల్ బోర్డు మెంబర్ గంగవరపు భాస్కర్‌రావు అన్నారు. స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చి నందు గల కత్తి లూకయ్య ఫంక్షన్ హాల్ నందు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం తర్వాత అన్యాక్రాంతమైన స్థలాలు వెంటనే చర్చికి చెందుతాయన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చర్చి ఆస్తులు చర్చికే చెందాలన్నారు. ఎవరైనా అన్యాక్రాంతం చేసిన ఆస్తులు చర్చికి అప్పగించకపోతే వారిపై కోర్టు దిక్కరణ కింద కేసు నమోదు చేయడం జరుతుందన్నారు. కోర్టు నుంచి వచ్చిన జడ్జిమెంట్ కాపీలను జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి, మండల తహసీల్దార్‌కు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసర ఫరాల సంఘం కార్యదర్శి చిలక చంద్రశేఖర్, ప్రసాద్, జె.నవబాబు, పి.రాజరత్నం, కె.ఏనుక, టి.థామస్, పి.ఏసురత్నం, కె.థామస్, కె.ఆదాం పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



గురజాల: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని ఎంపీడీవో షేక్ గౌసియాభేగం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ లేని చిన్నారులని గుర్తించి వారికి ఆధార్ వచ్చేలా చూడాలన్నారు. దానితో పాటు కొంతమంది ప్రభుత్వ సర్వే లిస్టులో కనిపించడం లేదని వారిని కూడా సర్వే చేయాలన్నారు. మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాజికి ప్రతిష్టాత్మక అవార్డు



కారెంపూడి: ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ పత్రిక ఉయ్ సర్వ్ ఇండియా సర్టిఫికెట్‌ను కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి బహూకరించింది. కొచ్చిలో సర్టిఫికెట్ స్వీకరించడానికి రావాల్సిందిగా జాజికి ఆహ్వానం అందింది. అయితే ఆయన హాజరుకాలేకపోవడంతో వారు దానిని కొరియర్ ద్వారా పంపడంతో సోమవారం సర్టిఫికెట్‌ను స్వీకరించారు. వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నందుకు గాను జాజికి ఆ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సౌత్ ఇండియా నెట్ వర్క్ మేనేజింగ్ ఎడిటర్ వివేక్ నారాయణ్ లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ప్రథమ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ సంతకాలతో అవార్డు వెలువడింది.

మార్గం సుగమం

- శరవేగంగా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం
- పూర్తయితే తీరనున్న రైల్వే ట్రాక్ గేటు కష్టాలు
- గత ప్రభుత్వంలో నిధులు మంజూరు
- రాకపోకల సమస్యకు శాశ్వతం పరిష్కారం



జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న రైల్వే అండర్ ఫాస్ బ్రిడ్జి



బ్రిడ్జి నిర్మాణ పనులు

పిడుగురాళ్ల: పట్టణంలో నిర్మాణమవుతున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పూర్తయితే.. జగనన్న కాలనీకి మహర్దశ పట్టనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జానపాడు రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.58 కోట్లు, రైల్వే అండర్ ఫాస్ బ్రిడ్జిల నిర్మాణాల రూ.27కోట్లు మంజూరు చేయించారు. నిధుల మంజూరైన వెంటనే కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. గత సార్వత్రిక ఎన్నికల కారణంగా నాలుగు నెలల పాటు పనులు నిలిచిపోయాయి. ఇటీవల పనులు పునఃప్రారంభించారు.

జగనన్న కాలనీకి ఇదే మార్గం..

పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లాలంటే రైల్వే ట్రాక్ దాటాలి. ఈ మార్గాన ఎక్కువ రైళ్ల ప్రయాణించడం వల్ల ఎక్కువ సార్లు రైల్వే గేటు పడుతూ ఉంటుంది. రైలు వచ్చే సమయానికి గేటు పడితే సమయం వెచ్చించాల్సి వచ్చేది. ఒక్కోసారి సుమారు అరగంటకు పైగా వేచి చూడాల్సి వస్తుంది. ఇదే మార్గాన పులిచింతల పునరావాస కేంద్రం, టిడ్కో ఇళ్లకు వెళ్లాల్సి ఉంది. ప్రతి అర గంటకు గేటు పడడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పునః ప్రారంభం కావడంతో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే.. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు రాకపోకల సమస్య శాశ్వతంగా తీరనుంది. జగనన్న కాలనీలో సుమారు 2,500 గృహాలు, టిడ్కో గృహాలు 2,300, పులిచింతల పునరావాస కేంద్రంలో 2 వేల గృహ వాసులకు ఎంతగానో ఉపయోగపడనుంది. రైల్వే శాఖ ఉత్తర్వులు మేరకు అండర్ ఫాస్ బ్రిడ్జి 2023లో ప్రారంభమైంది. రెండేళ్లలో అంటే 2025 చివరి నాటికి పని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆదేశించిన గడువులోగా గుత్తేదార్లు పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు జరిగిన పనులు

ఇప్పటి వరకు రైల్వే ట్రాక్ కింద బాగాన మట్టిని తొలగించారు. దారి మార్గం ఏర్పాటు చేశారు. ట్రాక్ కింద సిమెంట్ కాంక్రీట్‌తో దిమ్మెలు ఏర్పాటు చేశారు. రైల్వే రాకపోకలకు అంతరాయం లేకుండా పనులు చేపట్టారు. కాంక్రీట్ గడ్డర్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంది. పనులు కొనసాగిస్తే త్వరలోనే 100 శాతం పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గడవు లోగా పనులు పూర్తి చేస్తే ఎంతో మంది ప్రజలకు, రైతులకు కారపోకలకు శాశ్వత పరిష్కారం జరుగుతుంది.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్

రెంటచింతల: ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ మూఢావత్ అర్జున్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్, వీఆర్వోలకు, గ్రామ సర్వేయర్లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వే సమయంలో రైతులకు సమాచారం ఇచ్చి, వారి సర్వే నంబర్ల ఆధారంగా భూ రీ సర్వే చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని (డేటా)ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. 22 ఏ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వోలు పి.నాసర్‌రెడ్డి, రేఖ ప్రియదర్శిని, కె.బాలయ్య, విగ్నేశ్వరరావు, నెవలి శంకర్‌రెడ్డి, పి.పాపారావు, ఎం.నర్సింహారావు, టి.లింగయ్య, కె.కుమారుస్వామి, ఎస్.కాశయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించండి



సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

మాచర్ల రూరల్: అధికారులకు రైతులు సహకరించి రీ సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. ముత్యాలంపాడు గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు . సోమవారం రీ సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 818 ఎకరాల భూమి ఉందని, 130 ఎకరాల పట్టా భూమిగా ఉందన్నారు. ఈ నెల 25న గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు సమక్షంలో వారి భూమికి కోలతలు వేసి హద్దులు గుర్తించడం జరుగుతుందన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ప్రజలను, రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జాన్స్ వార్షికోత్సవం



బిషప్ భాగ్యయ్యకు స్వాగతం పలుకుతున్న పాఠశాల విద్యార్థులు

కారెంపూడి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధిలో గత 36 సంవత్సరాలుగా సెయింట్ జాన్స్ కీలక పాత్ర పోషించిందన్నారు. వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపడానికి పాఠశాల ఎంతో దోహదం చేసిందన్నారు. ఈ సందర్భంగా భాగ్యయ్యకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిస్టర్స్, వివిధ ప్రాంతాల పాధర్లు ఘనస్వాగతం పలికారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

అడవి పందుల నుంచి పంటల రక్షణ ఇలా...



పంటలను రక్షించుకునేందుకు రైతులు అవలంభిస్తున్న విధానం

అచ్చంపేట: అడవి వెంబడి పొలాల్లో వేసిన కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. పంట పొలంలో రెండు ఎత్తైన పోల్స్ పాతి, పై భాగాన రెండు పోల్స్‌నూ కలుపుతూ అడ్డంగా మరో పోల్ కడతారు. దానికి మధ్యలో ఫొటోలో చూపించిన విధంగా రెండు ఖాళీ కూల్ డ్రింక్స్ బాటిల్స్‌ను వేలాడదీస్తారు. ఆ రెంటి మధ్యలో సీలాలకు తగిలే విధంగా రెండు చిన్న చిన్న గట్టి ఇనుపరాడ్‌లను తాడుతో కడతారు. వాటికి దిగువన మందపాటి అట్టలను కడతారు. గాలికి అట్టలు కదిలి మధ్యలో ఉన్న ఇనుపరాడ్‌లు ఖాళీ సీసాలకు కొట్టుకుంటాయి. అప్పుడు వచ్చే శబ్దానికి అడవి పందులు పరారవుతాయి. ఇలా పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేయడం ద్వారా అడవి పందుల నుంచి రక్షణ పొందుతారు. ఈ దృశ్యం చెరుకుంపాలెంలో అడవి వెంబడి పంట పొలాల్లో కనిపించింది.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా జెల్ది నరసింహారావు



నియామక పత్రం అందుకున్న జెల్ది నరసింహారావు

క్రోసూరు : క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన జెల్ది నరసింహారావు మాల మహానాడు క్రోసూరు మండలం అధ్యక్షుడిగా నియమించబడ్డారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదాజాన్‌పాల్ నరసింహారావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు సంఘం అభివృద్ధికి, దళిత వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మాల మహానాడు నాయకులు, నియోజకవర్గ నాయకుడు జెర్రిపోతు చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గేదెల దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

పిడుగురాళ్ల: గేదెలను దొంతనం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. వివరాల ప్రకారం పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన కుంచపు దుర్గా ప్రసాద్ నెల రోజుల క్రితం కళ్లం టౌన్‌షిప్ ఎరియాలో తిరుమల అపార్ట్‌మెంట్ పక్కన ఇంటి ముందు కట్టేసి ఉంచిన మూడు గేదెలు, ఒక దూడను ఆటోలో ఎక్కించుకొని వెళ్లాడు. 9న పట్టణంలోని పిల్లుట్ల జంక్షన్ వద్ద అనమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం చేసిన మూడు గేదెలను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

మాచర్ల రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి, జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కంభంపాడు గ్రామ శివారులో సోమవారం దాడులు నిర్వమించినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.45,250 నగదు, 4 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే..వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ మోటార్ల విద్యుత్ తీగలు చోరీ

దాచేపల్లి: మాదినపాడు గ్రామ పరిధిలో వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. కొద్ది రోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వైర్లు కత్తిరించి, ఎత్తుకెళ్తున్నట్లు బాధిత రైతులు గుర్తించారు. సుమారుగా 35కి పైగా వ్యవసాయ బోర్ల నుంచి కేబుల్ తీగెలను చోరీ చేయడంతో వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలతో బోర్ల ద్వారా పంటలకు నీటి తడి పెట్టడం ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు.

నిరాడంబరతకు నిదర్శనం డాక్టర్ అరుణకుమారి



సత్తెనపల్లి: నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ పొట్ల అరుణకుమారి అని ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, రొటేరియన్ పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ అన్నారు. సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా డాక్టర్ అరుణకుమారిని నియమించిన సందర్భంగా సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో చిరుసత్కారం చేశారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ. ధర్మపత్ని భారతి, పోతుగంటి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, అప్పాపురపు నరేంద్ర తదితరులు ఉన్నారు.

రేపు ఓర్వకల్లు గంగమ్మతల్లి తిరునాళ్ల



అచ్చంపేట : మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళ్లమ్మ తిరునాళ్లను ఈ నెల 12న బుధవారం నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతి యేటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఓర్వకల్లు, రుద్రవరం , గ్రంధశిరి గ్రామాలలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి. అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, పాడిపంటలు ఇచ్చే అమ్మగా, సంతాన లక్ష్మిగా ఈ ప్రాంత ప్రజలు కొలుస్తారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నెలకొల్పారు. దూరప్రాంతం నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు.

ఘనంగా విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

పాలువాయిజంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయ 20వ వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని, స్వామివారికి నూతన పట్టు వస్త్రాల సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ, సుబ్రమణ్య స్వామి, లక్ష్మీ సరస్వతీ అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకుడు గణపతిశాస్త్రి నేతృత్వంలో కనుల పండుగగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు మండాది గ్రామానికి చెందిన వెంకటాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, చండీ రుద్ర హోమాలు జరిపించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రదక్షణ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ చైర్మన్ పాశం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జూలకంటి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉపవాస దీక్షలో..

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో 40 దినాల ఉపవాస ప్రార్థనలు ముగింపు సందర్భంగా పరిశుద్ధాత్మక వేడుక నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. డా.రెవరెండ్ దానియేలు ఆధ్వర్యంలో నాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతంలో 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మిగుల భూములపై చర్చించాలి

విజయపురిసౌత్: నాగార్జున సాగర్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్ కాలనీ ప్రజల చిరకాల వాంఛ పంచాయతీ కల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీర్చిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్ అభివృద్ధిపై స్థానికులు ఎమ్మెల్యేను అడిగారు. స్పందించిన జూలకంటి పంచాయతీలో విలీన ప్రక్రియ అనంతరం ప్రభుత్వానికి భూములు స్వాధీనం అయిన తర్వాత మిగులు భూములు, అందులో పేదల నివాసాల నిర్మాణానికి అనుమతులు ఇస్తారా లేదా అనే అంశాలను చర్చించాల్సి ఉంటుందని చెప్పారు. విజయపురిసౌత్ గ్రామం పంచాయతీ ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుందన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



దాచేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డాక్టర్ సుచరిత



విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న డాక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న ఎంఈఓ రవికుమార్

దాచేపల్లి: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సుచరిత, ఆమూల్య, మధు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సోమవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 13వేల మంది పిల్లలకు మాత్రలు అందజేశామని వెల్లడించారు. ఎంపీహెచ్‌ఈవో పట్టాభి, సీహెచ్‌వో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు సరస్వతీ దేవి, మేరికుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాద్ తెలిపారు. మాచవరం సెక్టార్ పరిధిలోని 6,442 మంది విద్యార్థులకు గాను 5,927 మందికి, పిల్లుట్ల సెక్టార్ పరిధిలో 3,385 విద్యార్థులకు గాను 3,150 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 17న పంపిణీ చేస్తామని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు, ఎంఈఓ శ్రీధర్, వైద్యాధికారి అన్వేష్, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలో 8,126 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను మండల వైద్య ఆరోగ్య శాఖ సోమవారం పంపిణీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మాత్రలను అందించారు. ప్రారంభ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ రవికుమార్‌తో పాటు పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.రమ్య, కె.లక్ష్మీమౌనిక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

సత్తెనపల్లి: గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలోని 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆ వృద్ధుడిని 108 వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సమాచారం తెలియకపోవడంతో ఎవరైనా గుర్తిస్తే సత్తెనపల్లి రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

నేడు గోపయ్య తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం

గురజాల: పల్లెగుంత రోడ్డులో వేంచేసియున్న గోపయ్య తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి పలు పూజలు, అభిషేకాలు జరుగుతాయని, అనంతరం స్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరుగుతుందన్నారు.

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా

సీఐ విజయ్‌కుమార్

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా వేయడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గీత కులాలకు సంబంధించిన మద్యం షాపులకు నిర్వహించవలసిన లాటరీ ప్రక్రియ వాయిదా వేయడమైందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి లాటరీ జరుగు తేది ప్రకటించ బడుతుందన్నారు. మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వారు మంగళవారం లాటరీ ప్రక్రియకు హాజరు కానవసరం లేదన్నారు.